సాక్షి వికారాబాద్

శనివారం । 16 । మార్చి । 2024



నేర చరితులపై ఫోకస్!

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. 8లో▸



బడికి ఉచిత విద్యుత్!

గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. 8లో▸



న్యూస్‌రీల్

19న తాండూరుకు చాగంటి రాక

తాండూరు టౌన్: ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు ఈ నెల 19న తాండూరుకు రానున్నట్లు తాండూరు గోశాల సేవా సమితి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోశాల సేవా సమితి దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని 19వ తేదీ సాయంత్రం 5నుంచి 9గంటల వరకు పట్టణంలోని ఆదర్శనగర్ పార్కులో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం పొందిన కార్మికులకు పరిహారం పొందడానికి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌గ్రేషియా పొందేందుకు వీలుగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈశ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద 2022 మార్చి 31 వరకు ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుంటే ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల నామినీలకు రూ.2 లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికుడికి రూ. లక్ష పరిహారం అందుతుందని తెలిపారు. ఎక్స్‌గ్రేషియా కోసం కలెక్టరేట్‌లోని సహాయ కార్మిక కమిషనర్‌కు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కోసం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గడువులోగా సీఎంఆర్ ఇవ్వండి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: గడువులోగా (2021- 22 సంవత్సరానికి సంబంధించిన) సీఎంఆర్ రైస్ ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021-22 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ రైస్‌ను ఏప్రిల్ చివరి నాటికి పౌరసరఫరాల సంస్థకు వంద శాతం చేరేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఎస్ఓ రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలేష్‌గుప్తా, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: మైనార్టీస్ స్టడీ సర్కిల్ సేవలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసుకున్న మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. మొదట దరఖాస్తు చేసుకున్న 100 మంది అభ్యర్థుల వరకే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మైనార్టీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు) అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 25లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. సంబంధిత సాఫ్ట్ కాపీలను direcotmrcteanfana@fmail.com మెయిల్ చేసి దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమో గ్రూప్-1 పరీక్ష కోసం చేసుకున్న దరఖాస్తు ఫారం కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు-2 జతపరిచి, ఇట్టి హార్డ్ కాపీలను తమ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్ 9912144364, 9440685713లలో సంప్రదించాలన్నారు.

గనుల శాఖ ఏడీగా సత్యనారాయణ

తాండూరు: గనుల శాఖ జిల్లా అసిస్టెంట్ డైరక్టర్ శ్యామ్యూల్ జాకబ్ నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఐదు నెలల క్రితమే ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. శుక్రవారం తాండూరు కార్యాలయంలో రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బీ సత్యనారాయణ జిల్లాకు బదిలీ అయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.




బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోనమెత్తిన మారేపల్లి

పెద్దేముల్ మండలం మారేపల్లిలో వెలసిన మైసమ్మ తల్లి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనమెత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. అమ్మా.. సల్లంగ చూడాలని వేడుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించారు. శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతరకు మారేపల్లి తోపాటు జనగాం, మంబాపూర్, తాండూరు, పెద్దేముల్, ఇందోల్, ఓగ్లాపూర్ నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.

– పెద్దేముల్



పూజలందుకున్న మైసమ్మ తల్లి

జాగ లేక జాప్యం!

ఆర్టీఓ కార్యాలయ నిర్మాణానికి స్థల సమస్య

- భవనం, ట్రాక్ కోసం 13 ఎకరాలు అవసరం
- నాలుగేళ్లుగా ఎదురు చూపులు
- జిల్లాలో వాహనాల సంఖ్య 1.2లక్షలు
- ఏటా ట్యాక్సుల రూపంలో రూ.50 కోట్ల ఆదాయం



వికారాబాద్‌లోని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కార్యాలయం

వికారాబాద్: జిల్లాల పునర్విభజన తరువాత వికారాబాద్‌లో ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్లు అవుతున్నా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ శాఖకు సొంత భవనం, ట్రాక్ ఏర్పాటుకు స్థలం సమకూరలేదు. పట్టణ పరిధిలో ఇందుకు కారణం అవసరమైన 13ఎకరాల భూమి ఒకే చోట లేకపోవడమే. ప్రస్తుతం అరకొర సౌకర్యాలతో శివారెడ్డిపేటలోని అద్దె భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కార్యాలయంతో పాటు టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ కూడా ఓపెన్ ప్లేస్‌లోనే కొనసాగిస్తున్నారు. జిల్లాల పునర్విభజనకు ముందు పరిగిలో మాత్రమే ఆర్టీఏ యూనిట్ కార్యాలయం ఉండేది. కొత్త జిల్లా ఏర్పాటుతో వికారాబాద్‌లో ఆర్టీఓ(డీటీఓ) కార్యాలయం, పరిగిలో యూనిట్ కార్యాలయం, తాండూరులో ఎంవీఐ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పరిగిలో కార్యాలయానికి మాత్రమే సొంత భవనం ఉంది. మిగతా రెండు చోట్ల వికారాబాద్, తాండూరు కార్యాలయాలకు సొంత భవనాలు, టెస్టు డ్రైవింగ్ ట్రాక్ లేవు.

ట్రాక్ లేకుండానే లైసెన్సులు జారీ

వికారాబాద్, తాండూరులో ట్రాక్‌లు లేకపోవడంతో ఓపెన్ ప్లేస్‌లలో డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. దీంతో వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి వెళ్లి.. వారు ప్రమాదాల బారిన పడటమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కార్యాలయం, డ్రైవింగ్ ట్రాక్ కోసం 13 ఎకరాల భూమి అవసరమని ఆర్టీఏ అధికారులు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మూడెకరాల స్థలం చూపించి చేతులు దులుపుకొన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి శివారులో 160 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న అధికారులు ఆర్టీఏ కార్యాలయానికి 13 ఎకరాల భూమి కేటాయించలేక పోతున్నారు.

ఆదాయం ఉన్నా..

జిల్లాలో వివిధ రకాల వాహనాలు 1.2 లక్షల వరకు ఉన్నాయి.ఇందులో అత్యధికంగా 38,903 ఆటోలు, 38,482 ద్విచక్ర వాహనాలు. వీటి ద్వారా సగటున ఏడాదికి రూ. 40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. పెట్టుకున్న టార్గెట్‌లో ఏడాదికి 600 నుంచి 700 రెట్ల ఆదాయం అధికంగా వస్తుంది. ఇంత ఆదాయం ఉన్నా ఆర్టీఏ కార్యాలయానికి సొంత భవనం, టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌లకు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పలుసార్లు విన్నవించాం

జిల్లా కేంద్రంలో డీటీఓ కార్యాలయం, టెస్టు డ్రైవింగ్ ట్రాక్ నిర్మించాలంటే 13 ఎకరాల భూమి అవసరం. అది కూడా జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల లోపు ఉంటే బాగుంటుంది. ఈ విషయాన్ని పలు మార్లు జిల్లా రెవెన్యూ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ఒకటి రెండు చోట్ల స్థలం చూపించారు. అక్కడ ఉన్న స్థలం రెండు లేదా మూడెకరాలే ఉంది. జిల్లా కేంద్రానికి 10కిలోమీటర్ల అవతల మరో స్థలం చూపించారు. సరిపడా భూమి లేకపోవడంతో భవన నిర్మాణం, ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపలేకపోతున్నాం.

– వెంకట్‌రెడ్డి, డీటీఓ



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

ఆన్‌లైన్ మోసాల బారిన పడకండి

పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్

అనంతగిరి: వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోజనాలు, హక్కులు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. 1986లో వినియోగదారుల చట్టం అమల్లోకి వచ్చిందని, ఈ చట్టాన్ని 2019లో మార్పు చేసి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చట్టంగా మార్పు చేశారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలకు ఆశ పడరాదని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వస్తువు కొనుగోలు చేసే ముందు తయారీ చిరునామా, గడువు తేదీలను చూసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు తప్పకుండా రశీదు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుగుణబాయి, లీగల్ మెట్రాలజీ అధికారులు, రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- నెల రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి
- వరుస మరణాలతో అల్లాడుతున్న బాధితులు
- అండగా నిలిచిన దాతలు, గ్రామస్తులు



నర్సమ్మ



నర్సింలు




నాగమ్మ

తాండూరు రూరల్: నెల రోజుల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో బాధితులు తీరని శోకసంద్రంలో మునిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన కేసీ నర్సింలు(53) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన ఇల్లరికపు అల్లుడు. అనారోగ్యం బారిన పడిన నర్సింలు అత్త నర్సమ్మ (60) జనవరి 29న కన్నుమూసింది. ఇది జరిగి వారం తిరగకుండానే.. ఫిబ్రవరి 5న అంతారం శివారు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింలు మృత్యువాత పడ్డాడు. తల్లి, భర్త మరణాలను తట్టుకోలేకపోయిన నర్సింలు భార్య నాగమ్మ(46) తీవ్ర మానసిక సంఘర్షణ ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆమె కూడా మృతిచెందింది. నర్సింలు, నాగమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వీరిలో ముగ్గురికి వివాహాలయ్యాయి. ఇదిలా ఉండగా బాధితుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, భూకైలాస్ వ్యవస్థాపకుడు వాసుపవార్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేశారు.

జలం.. పాతాళం..!

- జిల్లాలో పడిపోతున్న భూగర్భ జలాలు
- నెల రోజుల వ్యవధిలో నగటున 2 మీటర్ల మేర పడిపోయిన నీటి మట్టం



తాండూరు: వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. భానుడి ప్రతాపానికి భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి. బోరుబావుల్లో నీరు లేకపోవడంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి తొలి రోజుల్లోనే నీటి ఎద్దడి నెలకొంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటని అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు. గతేడాది ఆగస్టు నెలలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు మెరుగు పడ్డాయి. ఆ తర్వాత వానలు పడకపోవడంతో ప్రతి నెలా భూగర్భ జల మట్టం పడిపోతూ వస్తోంది.

13.13 మీటర్ల లోతులో..

జిల్లాలోని 20 మండలాల్లో ప్రతి నెలా 17నుంచి 26వ తేదీ వరకు భూగర్భ జల వనరుల ఏ మేరకు ఉన్నాయి అనే విషయాన్ని ఆ శాఖ ఆధ్వర్యంలో లెక్కిస్తారు. 73 కేంద్రాల నుంచి భూగర్భ జలాల వివరాలను ఫిబ్రవరిలో పరిశీలించి రికార్డు చేశారు. జిల్లాలో సగటున 13.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నట్లు గుర్తించారు. ఉష్ణోగ్రతలు పెరిగితే 25నుంచి 30 మీటర్ల వరకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పలు మండలాల్లో 20 నుంచి 25 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. మరి కొన్ని మండలాల్లో భూగర్భజలాలు కొద్దిగా తగ్గాయి.

మర్పల్లి మండలంలో..

జిల్లాలోని మర్పల్లి మండలంలో గతేడాది మే నెలలో 17.07 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో సేకరించిన వివరాల ప్రకారం 21.29 లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయని అధికారులు గుర్తించారు. మే నెల నాటికి మరింత తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. బొంరాస్‌పేట్ మండలం అంసన్‌పల్లిలో 29.22 మీటర్లు, బూరాన్‌పూర్‌లో 25.95 మీటర్లు, పెద్దేముల్ మండలం నాగులపల్లిలో 32.38 మీటర్లు, తాండూరు మండలం జినోగుర్తి గ్రామంలో 24.13 మీటర్లు, ఉద్దండాపూర్‌లో 23.91 మీటర్ల వరకు భూగర్భజలాలు పడిపోయాయి.

వర్షపు నీరు వృథా

ప్రతి ఏటా జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టినా, సమర్థవంతంగా అమలు చేయకపోవడంతో వృథా అవుతున్నాయి. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఫాంపాండ్, సోక్ పిట్, ఇంకుడు గుంతలు నిర్మించారు. చాలా ప్రాంతాల్లో అవి పూడిపోయాయి. దీంతో వర్షపు నీరు దిగువకు వృథాగా పోతోంది.

యథేచ్ఛగా బోర్లు



జిల్లాలో రెండు మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గాయి. రైతులు ఇష్టం వచ్చినట్లు బోర్లు వేస్తున్నారు. ఇది కూడా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షపు నీరు వృథాగా పోకుండా పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. మరో రెండు నెలలు ఎండలు ఇలాగా ఉంటే భూగర్భజలాలు మరింత పడిపోయే అవకాశం ఉంది. ప్రజలు నీటిని వృథా చేయరాదు.

– దీపారెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ అధికారి

దరఖాస్తుల ఆహ్వానం

తుర్కయంజాల్: ఉపాధ్యాయ నియామకాల కోసం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ,డీఎడ్, బీఎడ్ అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఏప్రిల్ 3 నుంచి జూన్ 2వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎంపీ ఎన్నికలకు సిద్ధమవ్వండి

- నోడల్ అధికారులదే కీలక పాత్ర
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, అదనపు కలెక్టర్లతో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే నోడల్ అధికారులకు అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మొదటి ర్యాండమైజేషన్ అనంతరం పీఓ, ఏపీఓలకు సైతం శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల సామగ్రికి సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు చేస్తూ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద సిబ్బందిని నియమించాలన్నారు. ఇందులో పోలీస్, ఆర్టీవో, ఆర్టీసీ, ఎక్సైజ్ ఉద్యోగులు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల యాప్‌లతో పాటు, ఎంసీఎంసీ, సీ విజిల్‌పై ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ, పట్టణ స్థాయి నుంచి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. వలస కూలీలు, దివ్యాంగులు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి హోం ఓటింగ్‌పై సూచనలు చేయాలన్నారు. ఎన్నికలకు అవసరమైన బందోబస్తును సిద్ధం చేసుకోవాలని అన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్లకు సమాయత్తం కావాలన్నారు. పెయిడ్ ఆర్టికల్స్, ప్రకటనలు వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. కమ్యూనికేషన్ ప్లాన్ రూపొందించడం, ఓటరు జాబితా తయారీకి సంసిద్ధులు కావాలన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, సీ విజిల్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు కృషి చేయాలని తెలిపారు. ఈ టీం అధికారులు వినియోగించే వాహనాలకు జీపీఎస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోడ్ అమల్లోకి రాగానే వాహనాల తనిఖీలు, మద్యం, డబ్బు రవాణాపై దృష్టి సారిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసులు, నోడల్ ఆఫీసర్లు, డీఎస్పీలు, సీఐలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారెడ్డికి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

పెద్దేముల్: తెలంగాణ స్టేట్ ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వికారాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ లక్ష్మారెడ్డి కలిశారు. వారికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

సర్వేయర్‌పై ఫిర్యాదు



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న బాధితుడు, నాయకులు

తాండూరు టౌన్: భూమిని తప్పుగా సర్వే చేసి అక్రమార్కులకు సహాయపడుతున్న సర్వేయర్ మహేశ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ తాండూరు ఆర్డీఓకు బాధితుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్ శుక్రవారం వినతిప్రతం అందజేశారు. ఈసందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. యాలాల మండలం కమాల్‌పూర్‌కు చెందిన తలారి లాలప్పకు సర్వే నంబర్ 124/ఆ లో 38 గుంటల భూమి ఉన్నది. ఆర్థిక ఇబ్బందులతో లాలప్ప భూమిని విక్రయించాలనుకున్నాడు. అయితే, భూమిని సర్వే చేసిన సర్వేయర్ మహేశ్ కేవలం 34 గుంటల భూమి మాత్రమే లాలప్పకు చెందినదిగా చేశాడు. మిగతా నాలుగు గుంటల భూమిని పక్కనే ఉన్న రైతుకి చెందినదిగా చూపిస్తున్నాడు. కొందరు వ్యక్తులు భూమిని తాము చెప్పిన వారికే విక్రయించాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. తప్పుడు సర్వే చేసిన మహేశ్‌ను వెంటనే సస్పెండ్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

ధారూరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని నాగారంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మద్దులపల్లి శ్రీనివాస్ అలియాస్ ప్రేమ్‌కుమార్(34) శుక్రవారం వరి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో మోటారు మొరాయించడంతో కాగ్నా నదిలోకి దిగి.. తీగలు సరిచేస్తుండగా షాక్‌కు గురై మృతిచెందాడు. ఇది గమనించిన ఇరుగు పొరుగు రైతులు వచ్చి ప్రేమ్‌కుమార్‌ను బయటకు లాగి, వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. కాగ్నాలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేర చరితులపై ఫోకస్!

- వరుస ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ప్రత్యేక దృష్టి
- జిల్లాలో 746 మంది నేరస్తులు
- కదలికలపై నిఘా పెట్టిన జిల్లా పోలీస్‌బాస్

తాండూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో నేర చరిత్ర కలిగిన 746 మంది కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. రాబోయే వరుస ఎన్నికలకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో రెండేళ్ల క్రితం 200 మంది రౌడీ షీటర్లు ఉంటే ప్రస్తుతం వీరి సంఖ్య 302కు చేరింది. వీరి కదలికలపై ప్రత్యేక టీమ్‌లతో పర్యవేక్షణ చేస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టం

వికారాబాద్ జిల్లాలో మూడు పోలీస్ సబ్ డివిజన్‌ల పరిధిలో 19 పోలీస్ స్టేషన్‌లు, ఒక మహిళా పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో తాండూరు పట్టణం, కరన్‌కోట్, పెద్దేముల్, బషీరాబాద్, యాలాల ఠాణాలు ఉన్నాయి. పరిగి సబ్ డివిజన్ పరిధిలో కొడంగల్, పరిగి నియోజకవర్గంలో ఉన్న ఠాణాలు, వికారాబాద్‌లో వికారాబాద్, ధారురు, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, బంట్వారం, కోట్‌పల్లిలలో పీఎస్‌లు కొనసాగుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎవరైన హత్యలు, దారి దోపిడీలు, దొంగతనాలు వరుసగా చేసి జైలుకు వెళ్లి వచ్చిన వారి కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. జిల్లాకు కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. దీంతో తాండూరు రూరల్ సర్కిల్, కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు నేరస్తులపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు.



తాండూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

రంగంలోకి ప్రత్యేక బృందాలు

జిల్లాలో రౌడీ షీటర్‌లు, కేడీలు, డీసీలతో నేర చరిత్ర కలిగిన వారు 746 మంది ఉన్నట్లు పోలీసు అధికారులు ధ్రువీకరించారు. వరుసగా నేరాలు చేస్తున్న వారిపై పోలీసు అధికారులు రౌడీషీటర్ ఓపెన్ చేస్తున్నారు. ఒకే వ్యక్తిపై మూడు కేసులు నమోదైతే సదరు వ్యక్తిపై రౌడీషీటర్ ఓపెన్ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 303 మందిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేశారు. అంతేకాకుండా జిల్లాలో కేడీలు 9మంది ఉండగా, ఇతర రాష్ట్రాలలో నేరాలను చేసిన 6 మందిపై డీసీ (డోషియ క్రిమినల్) జాబితాలో చేర్చి కేసులు నమోదు చేశారు. మరోవైపు జిల్లాలో నేర చరిత్ర కలిగిన(ససస్పెక్ట్ షీట్) 428 మంది ఉన్నారు. రౌడీ షీటర్లతో పాటు మిగతా నేరస్తుల కదలికలపై పోలీసు అధికారులు ఫోకస్ పెట్టారు. అందుకోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

హద్దు దాటకుండా

పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు పాత నేరస్తుల కదలికలపై నిఘా పెడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇప్పటికే కొంత మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మిగిలిన పాత నేరస్తులను బైండోవర్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సమయంలో విద్వేషాలను రెచ్చగొట్టి గొడవలకు కారణమవుతున్న వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు జిల్లాలో వాహనాలను తనిఖీ చేస్తు భద్రత చర్యలను చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకొని వివరాలను సేకరిస్తారు.

శాంతి భద్రతలే ముఖ్యం



శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాం. రానున్న వరుస ఎన్నికలలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం. జిల్లాలో రౌడీ షీట్ కేసులు నమోదు చేశాం. తెలంగాణ–కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్ జిల్లా

బడికి ఉచిత విద్యుత్!

- అమలుపై ప్రభుత్వం కసరత్తు
- ప్రభుత్వ పాఠశాలల్లో కరెంట్ కష్టాలు దూరం

దౌల్తాబాద్: గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉచిత విద్యుత్ అమలుకు కసరత్తు చేస్తుంది. పాఠశాలల్లో ఫిబ్రవరి నెలలో ఎంత యూనిట్లు వినియోగించారు.. పాత బకాయిలు ఎన్ని ఉన్నాయని విద్యాశాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా బాధ్యత ప్రభుత్వానిదేనని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు ఉన్నవారికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం పాఠశాలల్లో అమలు నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

విద్యుత్‌కే అధిక నిధులు

బడి నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఏటా పాఠశాలలకు ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేస్తారు. విద్యార్థుల సంఖ్య నమోదు ఆధారంగా పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 1 నుంచి 30 మంది విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50 వేలు, 251 నుంచి వెయ్యిమందికి రూ.75 వేలు, 1000 మందికిపైగా రూ.లక్ష నిధులు మంజూరు అవుతాయి. ఈ నిధులు రెండు విడతల్లో జమ చేస్తారు. ఇందులో సగం వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండగా మిగతావి మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు, చిన్నపాటి మరమ్మతులు, స్టేషనరి, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు జెండా పండుగలు ఇతరాత్ర అవసరాలకు వినియోగిస్తున్నారు. వచ్చే బిల్లు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రాంట్‌లో సగం మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.



దౌల్తాబాద్ ప్రాథమిక పాఠశాల

విధుల్లో చేరిన స్టాఫ్‌నర్సులు

తాండూరు: తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 46 మంది స్టాఫ్‌నర్సులు నూతనంగా విధుల్లోకి చేరారు. గతేడాది ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల నియామకానికి అర్హత పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆస్పత్రికి 47 మంది స్టాఫ్‌నర్సులను భర్తీ చేసింది. దీంతో శుక్రవారం జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ ఆనంద్ గోపాల్‌రెడ్డి సమక్షంలో నర్సులు బాధ్యతలు స్వీకరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: మానవసేవే మాధవసేవ అని వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆలంపల్లి ప్రధాన రోడ్డులో సందీప్ మెడికల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాని చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇలాంటి ఆలోచన రావడం చాలా గొప్ప విషయమన్నారు. ఎండకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చినందుకు అభినందించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, నిర్వాహకులు సందీప్, ప్రవీణ్, విజయ్, నరేందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా కార్పొరేషన్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రమేష్‌మహరాజ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

తాండూరు: ముదిరాజ్‌లకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. శుక్రవారం తాండూరు నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో రమేష్ మహరాజ్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మహారాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒకేసారి 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్‌లో ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. బీసీ వర్గాలకు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన గెలుపునకు ముదిరాజ్‌లు ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కులం పేరుతో పథకాలను ప్రారంభించారు. కానీ ఆ కులం వారికి ఎంత లబ్ధి జరిగిందని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేవలం కమీషన్‌లపైనే శ్రద్ధ పెట్టిందన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ముదిరాజ్ భవన నిర్మాణానికి భూకేటాయింపు త్వరలోనే ఇస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, జెడ్పీటీసీ థారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, నర్సింహులు, రాములు, వేణుగోపాల్, రాము, హన్మంతుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శివభక్తుల శ్రీశైల మహా పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: నారాయణఖేడ్, సంగారెడ్డి పరిసరా గ్రామాల భక్తులు సుమారు 800 మంది మూడు రోజుల క్రితం శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. శుక్రవారం ఉదయం కొడంగల్ పట్టణంలోని మహాదేవుని ఆలయానికి చేరుకొని విశ్రాంతి తీసుకున్నారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి తర్వాత వచ్చే బుధవారం రోజున పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహాదేవుని ఆలయ ఆవరణలో వీరేశ్వర్ శివాచార్యుల స్వామివారు భక్తులకు ప్రవచనాలు చెప్పారు. పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరితే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఏడాదిలో 15రోజుల పాటు నడక సాగించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుందని, మానసిక ప్రశాంత కలుగుతుందని చెప్పారు. భక్తితో ఏదైనా సాధించవచ్చని, నిర్మలమైన మనసుతో భగవంతుని ఆరాధిస్తే చింతలు దూరమవుతాయని అన్నారు. అనంతరం పాదయాత్రగా బయలుదేరుతూ మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ శివారులో వెలసిన శివాలయ ఆవరణలో మధ్యాహ్నం బస చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ భక్తులకు భోజన, నీటి వసతి కల్పించారు. కొడంగల్ మహాదేవుని ఆలయంలో అర్చకులు గడ్డం రాచయ్య, గడ్డం అఖిలేశ్వర్‌లు శివ భక్తులకు సేవ చేసుకున్నారు. వారికి మంచినీటి వసతితో పాటు ఉదయం ఫలహారం ఇచ్చి సేవ చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పరిగి: పెళ్లి సంబంధం చూసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సయ్యాద్ మల్కాపూర్ గేట్ దగ్గర శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన దన్నారం శ్రీనివాస్(40) తన బంధువుల అమ్మాయికి పెళ్లి సంబంధం చూసేందుకు దోమ మండలం బాస్పల్లి గ్రామానికి ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బంధువులు ఫోన్ చేసి పరిగికి రావాలని కోరడంతో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్‌ను సయ్యాద్ మల్కాపూర్ గేట్ దగ్గర లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలు

పరిగి: ఆర్టీసీ బస్సును ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని రాఘవపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడెం మండలం గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి సురేష్ పని నిమిత్తం పరిగికి వస్తున్నాడు. మార్గమధ్యలో ఇక్కడి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాఘవపూర్ గేట్ దగ్గర ద్విచక్రవాహనంపై నుంచి వస్తున్న సురేష్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు

కుల్కచర్ల: గుప్తనిధుల కోసం ఒక ఇంట్లో తవ్వకాలు నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం పోలీసు సిబ్బంది అంజిలయ్య, లక్ష్మణ్‌లు పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామపంచాయతీ దగ్గరలోని ఒక ఇంట్లో నుంచి తవ్వకాలు జరుగుతున్న శబ్దాలు వచ్చాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా కొందరు కుంకుమ, పసుపు చల్లుతూ పూజలు చేస్తున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా గుప్తనిధుల కోసం తవ్వకాలు చేశామని అంగీకరించారు. క్షుద్రపూజలు చేసిన అనంతయ్య, సుదర్శన్‌చారి, రాముచారి, శివ, శ్రీనివాస్, అర్జున్‌లపై శుక్రవారం కేసులు నమోదు చేశారు. మూఢ నమ్మకాలతో ఇబ్బంది సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి హెచ్చరించారు.

ఆధ్యాత్మిక ఝరి

- కన్హాలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- దేశవిదేశాల నుంచి తరలివచ్చిన ప్రముఖులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నందిగామ: భారత దేశం సర్వమత సమ్మేళనమని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ, గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్(దాజీ) అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనంలో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లోని పిల్లలకు చిన్నప్పటి నుంచే ఎదుటి వారికి సాయం చేసే అలవాటు నేర్పించాలని, సమాజంలో మార్పు తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, వారి తల్లిదండ్రులకు చదువు గురించి వివరించి, చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పాలన్నారు. పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించేందుకు కృషి చేయాలని, సమాజానికి ఉపయోగపడే పనులు చేయించాలని, మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని అన్నారు. చిన్నప్పటి నుంచే సేవా భావంతో పాటు, సమాజానికి ఉపయోగ పడే పనులను అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని మతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు పాల్గొనడం.. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, అందరు సమానమే అని చాటి చెప్పడం ప్రపంచ శాంతికి శుభ సూచకమని వివరించారు.

మంచి కార్యక్రమం..

కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సమ్మేళనం సమాజంలో చాలా మార్పు తీసుకువస్తుందని అపోలో ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్, సినీ హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల అభిప్రాయం వ్యక్తం చేశారు. ధ్యానం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కుల మత, ప్రాంత భేదం లేకుండా ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

అలరించిన ఆటపాట

మంగ్లీ తన ఆట పాటలతో విశేషంగా ఆకట్టుకున్నారు. వీరితో పాటు పలు మతాలకు చెందిన నృత్యకారులు, కళాకారులు తమ ఆటలు, పాటలతో అలరించారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

స్పీకర్ వీడియో మార్ఫింగ్ చేశారని ఫిర్యాదు

కేసు నమోదు: ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాత వీడియోను మార్ఫింగ్ చేసి కొత్త వీడియోగా సృష్టించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారనే ఫిర్యాదు మేరకు వికారాబాద్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం ఒక సంఘటన విషయంలో.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సెల్ ఫోన్‌లో మాట్లాడుతున్న పాత వీడియోను.. శంకర్ అనే వ్యక్తి ఇటీవలే మాట్లాడినట్లు సృష్టించి తన యూట్యూబ్ చానల్, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు అందడంతో పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఎవరైనా జిల్లాలో సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినా, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడినా.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

హనుమా.. నీ భూమికేది రక్షణ!

- తోలుకట్టలో దేవాదాయశాఖ భూమికి ఎసరు
- సుమారు వెయ్యి గజాల స్థలం కబ్జా

మొయినాబాద్: మనకు ఏ కష్టం వచ్చినా దేవుడికి మొక్కుకుని మొర పెట్టుకుంటాం.. కానీ, దేవుడి భూములకే రక్షణ లేకుండా పోయింది. భూ కబ్జాదారులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ వాలిపోతున్నారు. మొయినాబాద్ మండలం తోలుకట్టలో దేవుడి భూమిని కబ్జాచేసి దాని చుట్టూ ప్రహరీ గోడను నిర్మిస్తున్నారు. సంరక్షించాల్సిన దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు.

సుమారు రూ.కోటి విలువ

మండలంలోని తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్ 131లో హనుమాన్ దేవాలయానికి సంబంధించి 8.29 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గతంలో ఓ వ్యక్తి కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టాడు. దేవాదాయ శాఖ అధికారులు కోర్టుకు వెళ్లి ఏడాది క్రితం ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎకరం భూమిపై కోర్టు స్టే కొనసాగుతుంది. కాగా, మిగిలిన 7.29 ఎకరాల భూమి దేవాదాయ శాఖ ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం ఓ వ్యక్తి సుమారు వెయ్యి గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నాడు. తోలుకట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న వెయ్యి గజాల స్థలం చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మిస్తున్నాడు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. గత నాలుగైదు రోజులుగా కబ్జా పర్వం కొనసాగుతుంది.



దేవాదాయ శాఖ భూమిలో వెలిసిన ప్రహరీ

బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం



భూమి పూజ చేస్తున్న నాయకులు

మర్పల్లి: మండల పరిధిలోని కోట్‌మర్పల్లి నుంచి మొమిన్‌పేట్ మండలం ఇజ్రాచిట్టంపల్లికి వెళ్లే పంచాయత్ రాజ్ రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులకు శుక్రవారం అధికారులు శ్రీకారం చుట్టారు. వికారాబాద్ పట్టణం వెళ్లేందుకు కోట్‌మర్పల్లి నుంచి ఇజ్రాచిట్టంపల్లి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గత రెండు దశాబ్ద కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయత్‌రాజ్ శాఖ డీఈ జగదీశ్వర్, నాయకులు నిఖిల్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, అనంత్ రాం, ఏలియా, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.